క్లుప్తంగా

టీఏజీఎస్ మహాసభ జయప్రదం చేయాలి

దహెగాం: మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించనున్న తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం మండల మహాసభను జయప్రదం చేయాలని టీఏజీఎస్ మండల అధ్యక్షుడు దిగిడె బక్కన్న పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆదివాసీ గిరిజన సంఘం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆదివాసీలు, ఉద్యోగులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మహేష్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

పని దినాలు సద్వినియోగం చేసుకోవాలి



కూలీలతో మాట్లాడుతున్న సర్పంచ్ మౌనిశ్

కౌటాల: ఉపాధిహామీ కూలీలు పని దినాలను సద్వినియోగం చేసుకోవాలని కౌటాల సర్పంచ్ వొజ్జల మౌనిశ్ అన్నారు. కౌటాల గ్రామ శివారులో చేపడుతున్న ఉపాధిహామీ పనులను శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కూలీలు నిబంధనల ప్రకారం పనులు చేపట్టాలన్నారు. వంద రోజుల పని దినాలు పూర్తి చేయాలని తెలిపారు. పని ప్రదేశాల్లో కూలీలకు వసతులు కల్పించాలన్నారు. ఆయన వెంట ఉప సర్పంచ్ తిరుపతి, పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ, ఉన్నారు.

నిధులు మంజూరు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

కెరమెరి: జంగుబాయి ఆలయం ఎదుట షెడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మండలంలోని తుమ్మగూడ, రాంజిగూడ గ్రామాలకు చెందిన జంగుబాయి ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే ఆత్రం సక్కును కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో సక్కును కలిసి వినతిపత్రం అందించారు. త్వరలో నిధులు విడుదల చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు సభ్యులు తెలిపారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

ఆసిఫాబాద్అర్బన్: జిల్లా కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కులకు ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు చిప్ప సురేష్, క్రిష్ణంరాజు, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, రమేష్, సలహాదారులు వేణుగోపాల్, జర్నలిస్టులు సురేష్‌చారి, నితీష్, రవి తదితరులు పాల్గొన్నారు.

27న వాహనాల వేలం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని అక్రమ మద్యం రవాణా కేసుల్లో పట్టుబడిన వివిధ రకాల వాహనాల బహిరంగ వేలం ఈ నెల 27న స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో నిర్వహించనున్నట్లు కాగజ్‌నగర్ అబ్కారీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ విలాస్ తెలిపారు. జిల్లా ఎక్సైజ్ అధికారి ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి బహిరంగ వేలం ప్రక్రియను నిర్వహిస్తామని, ఆసక్తి కలిగిన వారు ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్	
కుమురంభీం	: విరూపాక్ష
కాగజ్‌నగర్	
వెంకటరమణ	: విరూపాక్ష

- ఆసిఫాబాద్అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.20
సిమ్లామిర్చి	60
దోసకాయ	50
చామగడ్డ	60
వంకాయ	60
బీరకాయ	60
కాకరకాయ	60
బెండకాయ	60
అలసంద	40
దొండకాయ	60
పచ్చిమిర్చి	50
పాలకూర	40
సోరకాయ	60
రతాళం	60
గోబి(పూల్)	80
క్యాబేజ	60

-ఆసిఫాబాద్అర్బన్

ప్రాణాలు పోతున్నాయ్..!



పాఠశాల గదిలోనే వైద్య చికిత్స పొందుతున్న విద్యార్థినులు (ఫైల్)

- కాగజ్‌నగర్ గురుకులంలో విద్యార్థినుల అవస్థలు
- ఈ విద్యాసంవత్సరంలో ఇద్దరు, గతంలో ఒకరు మృతి
- అస్వస్థతకు గురైతే సకాలంలో చికిత్స అందించని యాజమాన్యం
- విచారణ జరిపినా చర్యలు లేవు
- ఉన్నతాధికారుల తీరుపై పలు అనుమానాలు

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల(కాగజ్‌నగర్)లో అసలు ఏం జరుగుతోందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వరుస విద్యార్థినుల మృత్యు ఘంటికలు, అదృశ్యం వంటి సంఘటనలు చోటు చేసుకుంటుండడంతో బాలికల తల్లిదండ్రులు హడలిపోతున్నారు. గురుకులంలో విషాధ సంఘటనలు చోటు చేసుకున్నప్పుడు విచారణ జరుపుతున్న సాంఘిక సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు విచారణల్లో తేలిందేంటి, ఏం చర్యలు తీసుకున్నారనే అంశాలను ఎవరికి తెలియకుండా గోప్యంగా ఉంచుతున్నారు. విచారణలు పూర్తయినా బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడంపై బాలికల తల్లిదండ్రులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మృతికి నిర్లక్ష్యమే కారణమా..?

అనారోగ్యానికి గురైన విద్యార్థినులకు సకాలంలో వైద్యసేవలందక మృతి చెందుతున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యే వరకు సైతం ఆసుపత్రులకు తీసుకెళ్లకపోవడంతో సకాలంలో వైద్యం అందక పరిస్థితి విషమిస్తున్నట్లుగా తెలుస్తోంది. పాఠశాల యాజమాన్యం అనారోగ్యానికి గురైన బాలికలకు వైద్య పరీక్షలు చేయించకుండా ప్రథమ చికిత్సలు అందిస్తూ కాలయాపన చేస్తుండటం విద్యార్థినుల పాలిట శాపంగా మారుతోంది. గత ఏడాది పాఠశాలలో పలువురు విద్యార్థినులు అస్వస్థతకు గురైతే అటు ఆసుపత్రికి తరలించకుండా ఇటు తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకుండా గురుకుల పాఠశాలలోని ఓ గదిలోనే వారిని ఉంచి ట్యాబ్లెట్లు ఇచ్చి చికిత్స అందించినట్లుగా సమాచారం ఉంది. ఇలా చేస్తుండడంతోనే పరిస్థితి విషమిస్తోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విచారణలే కానీ చర్యలు శూన్యం..

గురుకుల పాఠశాలలో వరుస విషాధ సంఘటనలు చోటు చేసుకుంటున్నా అధికారులు తూతూ మంత్రంగా విచారణలు జరుపుతూ చేతులు దులుపుకుంటున్నారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీలు ఇవ్వడమే తప్ప పాఠశాలలో జరిగిన సంఘటనలపై సమగ్ర విచారణ జరిపిన దాఖలాలు కానరావడం లేదు. విచారణ జరిపినా బాధ్యులు ఎవరో చెప్పకుండా గోప్యంగా ఉంచుతున్నారు. ఇప్పటివరకు ఇన్ని సంఘటనలు జరిగినా బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ఆ శాఖ ఉన్నతాధికారుల పట్ల తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వరుస ఘటనలు

- కాగజ్‌నగర్ గురకులంలో 2022 –23 విద్యా సంవత్సరంలో ఇద్దరు విద్యార్థినులు మృతి చెందగా మరో ఇద్దరు విద్యార్థినులు అదృశ్యమయ్యారు.
- గురుకులంలో 5వ తరగతి చదువుతున్న గోమాసె అశ్విని(10) ఆగస్టు 24న వాంతులు చేసుకోవడంతో సిబ్బంది స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య చికిత్సలు చేయించి పాఠశాలకు తీసుకొచ్చారు. అదేరోజు రాత్రి విద్యార్థిని మళ్లీ వాంతులు చేసుకోవడంతో ఆగస్టు 25న తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి ఇంటికి పంపించారు. తల్లిదండ్రులు బాలికను వైద్య చికిత్సల నిమిత్తం కాగజ్‌నగర్, కరీంనగర్ ఆసుపత్రులకు తీసుకెళ్లగా ఆగస్టు 28న కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది.
- ఏప్రిల్ 14న సోదరి శ్రీవాణి(14) అనే విద్యార్థిని అనారోగ్యానికి గురై అస్వస్థతకు గురికావడంతో స్థానిక ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించి వైద్యం చేయించి తిరిగి పాఠశాలకు తీసుకొచ్చారు. మరుసటి రోజు ఉదయం పాఠశాలలో పరీక్ష రాస్తుండగా విద్యార్థిని తీవ్ర అస్వస్థతకు గురికావడంతో హుటాహుటిన పాఠశాల జేఎస్ఎం స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లగా మంచిర్యాలకు రెఫర్ చేశారు. సిర్పూర్(టి) సామాజిక ఆసుపత్రి నుంచి కాగజ్‌నగర్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే బాలిక మృతి చెందింది.
- ఫిబ్రవరిలో పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు పాఠశాల నుంచి అదృశ్యమయ్యారు. సిర్పూర్(టి) పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది ఫిర్యాదు చేయగా పోలీసుల విచారణ అనంతరం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో విద్యార్థినులను గుర్తించి సిర్పూర్(టి) పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చారు. పాఠశాల ప్రిన్సిపాల్ సంగీత, సిబ్బందికి విద్యార్థినులను పోలీసులు అప్పగించారు.
- గతేడాది విద్యా సంవత్సరంలో సైతం బాలిక అనారోగ్యంతో మృతిచెందింది. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న అమ్రపాలిక (13) అనే విద్యార్థిని రక్తహీనతతో బాధపడుతూ అనారోగ్యానికి గురైంది. పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించి బాలికను ఇంటికి పంపించారు. ఇంటికి వెళ్లిన తర్వాత విద్యార్థిని మృతి చెందింది. కాగా పాఠశాల నుంచి పలువురు విద్యార్థినులు వెళ్లిపోవడం వంటి సంఘటనలు చోటు చేసుకున్నా పాఠశాల యాజమాన్యం సమాచారం బయటకు పొక్కకుండా చూస్తున్నట్లు తెలుస్తోంది.

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్యే కోనేరు కోనప్ప



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

బెజ్జూర్: అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధుల సమావేశానికి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 25న కాగజ్‌నగర్ మండలం ఈసగాంలో పార్టీ క్రియాశీలక కార్యకర్తల సమావేశం ఉంటుందన్నారు. ఆయా గ్రామపంచాయతీల్లో బీఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ అనంతరం కార్యకర్తలందరు సభ స్థలానికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. బెజ్జూర్ మండల కేంద్రం నుంచి ఎలుకపెల్లి వరకు త్వరలో బీటీ రోడ్డు వేయనున్నట్లు తెలిపారు. మర్థిడి గ్రామం మీదుగా సలుగుపెల్లి వరకు బీటీ రోడ్డు సైతం వేస్తామన్నారు. మనిషి జీవితం శాశ్వతం కాదని, సమాజంలో ప్రజలకు చేసే సేవా కార్యక్రమాలే శాశ్వతంగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. మళ్లీ ప్రజలు ఆశీర్వదిస్తే సోమిని మీదుగా ప్రాణహితపై అంతర్‌రాష్ట్ర వంతెన నిర్మిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో జెడ్పీటీసీ పుష్పలత, సర్పంచ్ కొట్రంగి శారద భీంరావు, కోఆప్షన్ సభ్యుడు బషారత్ ఖాన్, సింగిల్ విండో మాజీ చైర్మన్ డోకె వెంకన్న, సింగిల్ విండో చైర్మన్ ఓంప్రకాష్, పార్టీ అధ్యక్షుడు సిడాం సకారాం, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు జగ్గా గౌడ్, ఆయా గ్రామపంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహంకాళి జాతర విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్సై భూమేష్

రెబ్బెన: ఇందిరానగర్‌లోని కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయంలో వచ్చే నెల 2న నిర్వహించనున్న జాతరను భక్తులు విజయవంతం చేయాలని రెబ్బెన ఎస్సై భూమేష్ అన్నారు. ఆలయంలో కొనసాగుతున్న జాతర ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. జాతరకు సంబంధించిన పోస్టర్లను ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మహారాష్ట్రలోని చాందా మహంకాళి తరువాత రెండో చాందా మహంకాళిగా ఇందిరానగర్‌లో స్వయంభూగా వెలిసిన మహంకాళి అమ్మవారు ప్రసిద్ధి చెందారన్నారు. జాతరకు ఇతర జిల్లాలతో పాటు మహారాష్ట్ర నుంచి సైతం భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారన్నారు. జాతరకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆలయ కమిటీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మోడెం తిరుపతిగౌడ్, ఆలయ ప్రధాన అర్చకుడు దేవార వినోద్, బీఆర్ఎస్ నాయకులు దుర్గం తిరుపతి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

గిరి గ్రామాల్లో స్వశక్తి కమిటీలు



నియామకపత్రాలు అందిస్తున్న తుకారాం

కెరమెరి: భారతీయ జనతా పార్టీ బలోపేతానికి స్వశక్తి కమిటీలు ఎంతో కీలకమని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పెద్మకి తుకారాం అన్నారు. శుక్రవారం మండలంలోని టోకెన్ మోవాడ్, పాట్నాపూర్ గ్రామాల్లో బూత్ స్వశక్తి అభియాన్ కమిటీ వేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై గ్రామీణులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయకులు సిడాం జంగు, ఆత్రం ధర్మూ, సిడాం భీంరావు, టేకం భీంరావు, మడావి భీంరావు, టేకం గుండా, ఆత్రం లేతు గోపాల్, మహేందర్, లక్ష్మణ్, సాంబా తదితరులు ఉన్నారు.

రంజాన్‌కు ముస్తాబైన మసీదులు



ముస్తాబైన మసీదు

కెరమెరి: నేడు నిర్వహించే రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని మసీదులు ముస్తాబయ్యాయి. నెల రోజులపాటు చేపట్టిన ఉపవాస దీక్షలను ముస్లింలు శనివారం ముగించనున్నారు. మండల కేంద్రంతో పాటు, ఉదానగర్, సుల్తాన్‌గూడ, సుర్ధాపూర్, ధనోరాలో గల మసీదులకు రంగులు పూశారు. సుల్తాన్‌గూడ ఈద్గా మైదానంలో నేడు ముస్లింలు ప్రత్యేక నమాజ్ చేయనున్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని ఈద్గా(ఖదీం)లో శనివారం జరిగే ఈదుల్ ఫితర్ పండుగ ప్రార్థనల సందర్భంగా శుక్రవారం జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు ఈద్గా కమిటీ పదాధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఈద్గాలో పిచ్చి మొక్కల తొలగింపు, నీటి వసతి, విద్యుత్ సౌకర్యం కల్పించగా పరిశీలించారు.

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని బాబాపూర్ చౌరస్తా సమీపంలోని ఈద్గా రంజాన్ వేడుకలకు ముస్తాబైంది. శనివారం ఉదయం ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. శుక్రవారం అబుల్ ఫయాజ్, అబ్దుల్లా, షబ్బీర్, రహమాన్ ఏర్పాట్లను పరిశీలించారు.

‘ఏఐటీయూసీ ద్వారానే హక్కులు సాధ్యం’



మాట్లాడుతున్న ఉపేందర్

దహెగాం: ఏఐటీయూసీ ద్వారానే కార్మికుల హక్కులు సాధ్యమని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏఐటీయూసీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ మేడేను అన్ని గ్రామాల్లో జయప్రదం చేయాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నేరవేర్చడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు.

నూతన కమిటీ ఎన్నిక..

ఏఐటీయూసీ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా నాగుల తిరుపతి, కార్యదర్శిగా బుడిపెల్లి మధూకర్, కోశాధికారిగా ఆర్. దామోదర్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మధూకర్, నాయకులు ఆనంద్‌రావు, వెంకటేశ్, చిరంజీవి, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి



కోనప్పకు వినతిపత్రం అందజేస్తున్న వీవోఏలు

కౌటాల: ఐకేపీ వీవోఏల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఎదుట మండలంలోని వీవోఏలు చేపట్టిన నిరవధిక సమ్మె ఐదోరోజు శుక్రవారం కొనసాగింది. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వీవోఏలు స్థానిక ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే కోనేరు కోనప్పకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వీవోఏల సంఘం మండలాధ్యక్షుడు వెంకటేశ్, వీవోఏలు రవి, కొండయ్య, శంకర్, అశోక్, భీంరావ్, మహేశ్వరి, పద్మ, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సక్కు

కెరమెరి: మండలంలోని ధనోరా గ్రామంలో వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం, ఉప సర్పంచ్ రిజ్వాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే ఆత్రం సక్కు ప్రారంభించారు. సయ్యద్ అబ్దుల్ రహమాన్, సల్లావుద్దిన్ అన్సారీ, సయ్యద్ ఖాలీద్ స్మారకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రంలో 24 గంటలు చల్లటి నీరు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కలెక్టర్ హేమంత్ బోర్కడే, అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, డీఈవో అశోక్, ఎంపీపీ పెందోర్ మోతీరాం, జెడ్పీటీసీ పెద్మకి దుర్పతబాయి తదితరులు ఉన్నారు.

పేకాట స్థావరంపై దాడి

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని దరిగాం శివారులో శుక్రవారం పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ సుధాకర్, ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. దాడుల్లో నిందితుల నుంచి రూ. 3380లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. పేకాట, ఆన్‌లైన్ మట్కా, జూదం, ఐపీఎల్ బెట్టింగ్‌లకు పాల్పడే వారి సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

సూచనలు పాటించాలి

బెజ్జూర్: వరి సాగు చేస్తున్న రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని ఏఈవోలు మారుతి, మీన అన్నారు. శుక్రవారం మండలంలోని రేచీని, మర్థిడి శివారు, బెజ్జూర్ శివారులోని యాసంగి వరి పంటలను రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వారు మాట్లాడుతూ వాతావరణంలో మార్పుల వల్ల వరిలో కాండం తొలుచు పురుగు ఉధృతి పెరుగుతుందన్నారు. దీని నివారణకు ఎకరాకు 80 ఎంఎల్ క్లోరంట్రానిలిప్రోల్ మందులు పిచికారీ చేయాలన్నారు.

యూనిఫాం క్లాత్ పంపిణీ

కెరమెరి: మండలంలోని 85 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులకు ఎంఈవో కుడ్మెత సుధాకర్ ఆదేశాల మేరకు యూనిఫాం క్లాత్ పంపిణీ చేసినట్లు ఎమ్మార్సీ సిబ్బంది, ఎంఐఎస్ కోఆర్డినేటర్ అశ్వినీ తెలిపారు. మొత్తం 90 పాఠశాలలకు గాను 85 బడుల్లో క్లాత్ అందించినట్లు పేర్కొన్నారు.

25 నుంచి ఓపెన్ సైన్స్ విద్యార్థులకు పరీక్షలు

కాగజ్‌నగర్‌టౌన్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో మొదటి సంవత్సరం డిగ్రీలో ప్రవేశం పొందిన రెగ్యూలర్ సైన్స్ విద్యార్థులకు సెమిస్టర్ 1 సైన్స్ ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 25వ తేదీ నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆదిలాబాద్‌లో నిర్వహించనున్నట్లు కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యయన కేంద్రం కో ఆర్డినేటర్ దత్తాత్రేయ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9866398678 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

విద్యాభివృద్ధికి సహకారం అందిస్తాం

కాగజ్‌నగర్‌టౌన్: విద్యాభివృద్ధికి ఎస్పీఎం యాజమాన్యం అన్ని విధాల సహకారం అందిస్తోందని, మిల్లు వైస్‌ప్రెసిడెంట్ మిశ్రా అన్నారు. మిల్లు యాజమాన్యం, సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ ఎడ్యూకేషన్, కాగజ్‌నగర్ టీం సంయుక్తంగా గత మార్చి 31న నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు శుక్రవారం స్థానిక హెచ్‌ఆర్‌డీ సెంటర్‌లో బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో విద్యాభివృద్ధి కోసం యాజమాన్యం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్లు పేర్కొన్నారు. ఎంఈవో భిక్షపతి, రమేశ్ రావు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

కాగజ్‌నగర్‌టౌన్: అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకొని ఆ శాఖ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పట్టణంలోని శ్రీ కృష్ణవేణి పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. అగ్ని ప్రమాదాలు, నివారణ చర్యలు అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పలువురు విద్యార్థులు ప్రతిభ కనబర్చగా, శుక్రవారం అగ్ని మాపక అధికారి సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల కరస్పాండెంట్ దోమల సురవర్ధన్, మేనేజర్ ప్రవీణ్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో ఆఫర్ లెటర్లు అందజేత



జాబ్ ఆఫర్ లెటర్లతో అభ్యర్థులు

కాగజ్‌నగర్‌టౌన్: ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక పటేల్ గార్డెన్స్‌లో నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో 821 మంది అభ్యర్థులకు జాబ్ ఆఫర్ లెటర్లను ప్రజా బంధు ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు అందజేశారు. 2800 మంది అభ్యర్థులు మేళాకు హాజరుకాగా 54 ప్రైవేట్ కంపెనీల హెచ్‌ఆర్ ప్రతినిధులు 821 మందికి జాబ్ ఆఫర్ లెటర్లు అందించారు. మేళాను ప్రముఖ సమాజ సేవకురాలు వైశాలి బియాని ప్రారంభించగా, ప్రముఖ హిప్నాటిస్ట్ శశి కిరణ్ వ్యక్తిత్వ వికాసంపై ఉపన్యాసం ఇచ్చారు.

అంకితభావంతో పని చేయాలి

కెరమెరి: ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేస్తేనే మెరుగైన ఫలితాలు సాధించగలమని జిల్లా సెక్టోరియల్ అధికారులు రాథోడ్ సుభాష్, జంబోజు సత్తయ్య అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు ప్రధానోపాధ్యాయులతో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపు కోసం ఏబీసీ, త్రీఆర్ తదితర కార్యక్రమాలతోపాటు ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని చేపట్టినా ఆశించిన ఫలితాలను సాధించలేకపోయామన్నారు. యూడైస్ ప్లస్‌లోనూ అనేక తప్పులు దొర్లుతున్నాయని పేర్కొన్నారు. ఎంఎస్‌వో ఆడే ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

ఆసిఫాబాద్అర్బన్: ఆసిఫాబాద్ మండలంలోని తుంపల్లి ప్రభుత్వ పాఠశాలలో మన ఊరు– మన బడి కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న పనులను శుక్రవారం జిల్లా సెక్టోరియల్ అధికారులు రాథోడ్ సుభాష్, సత్తయ్య పరిశీలించారు. పనుల నాణ్యతపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయులు లాలాజీ, చైర్మన్ దత్తు, సర్పంచ్ లక్ష్మి, ఉపాధ్యాయులు శంకర్, సంతోష్ పాల్గొన్నారు.

రాజ్యాధికార పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా వెంకన్న



వెంకన్నకు నియామకపత్రం అందజేస్తున్న నారగోని

ఆసిఫాబాద్: రాజ్యాధికార పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా జిల్లా కేంద్రానికి చెందిన కోట వెంకన్న నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో పార్టీ జాతీయ అధ్యక్షుడు వీజీఆర్ నారగోని నియామకపత్రం అందజేసినట్లు కోట వెంకన్న తెలిపారు. వెంకన్న గత అసెంబ్లీ ఎన్నికల్లో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ పార్టీ అభ్యర్థిగా సిర్పూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు.